## క్లుప్తంగా

### సాగర్‌నగర్‌లో పాము కలకలం



స్థానికుల చేతిలో హతమైన పాము

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్‌లో సోమవారం 7 అడుగుల నాగు పాము కలకలం రేపింది. సాయంత్రం సమయంలో సాగర్‌నగర్ సమీపంలోని సచివాలయం వెనుక రోడ్డుపై పాము వెళ్లడాన్ని స్థానికులు చూశారు. భయభ్రాంతులకు గురైన వీరు యువకుల సహాయంతో దీనిని హతమార్చారు. ఇదంతా కొండప్రాంతం కావడం, ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో తరచూ పాములు వస్తుంటాయని స్థానికులు తెలిపారు.

### నిరంతరం వెలుగులే ..



ఉదయం వెలుగుతున్న లైట్లు

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేట నుంచి భీమిలి వరకు ఉన్న సెంట్రల్ లైటింగ్ నిరంతరం వెలుగుతూనే ఉంటోంది. పగలు, రాత్రి తేడా లేకుండా నిత్యం లైట్లు వెలగడంతో విద్యుత్ వృథా అవుతోందని పలువురు తెలిపారు. అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### కుక్కల బెడదపై జెడ్సీకి వినతి



జెడ్సీ శైలజా వల్లికి వినతి పత్రం ఇస్తున్న శ్రీకాంత్

మధురవాడ: ఊరకుక్కల నిర్మూలనకు తక్షణ చర్యలు చేపట్టాలని పీఎం పాలెం కార్‌షెడ్ జంక్షన్ సమీపంలోని ఆనంద్‌నగర్, అమృతా ఆర్కేడ్, భావన ఆర్కేడ్, అశ్విని ఆర్కేడ్, కీర్తన ఆర్కేడ్ పరిసర అపార్ట్‌మెంట్ వాసులు కోరుతున్నారు. ఈ మేరకు ఆనంద్‌నగర్ అపార్ట్‌మెంట్స్ అధ్యక్షుడు శ్రీకాంత్ తదితరులు సోమవారం జోనల్ కార్యాలయంలో జెడ్సీ శైలజావల్లిని కలిసి, వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఇక్కడ సుమారు అరడజనుకు పైనే అపార్ట్‌మెంట్‌లు ఉన్నాయని, వీటి పరిసర ప్రాంతాలలో పదుల సంఖ్యలో ఊర కుక్కలు సంచారం బాగా పెరిగిపోయిందని తెలిపారు. అపార్ట్‌మెంట్ సెల్లార్లలోకి చొరబడడంతో ఇబ్బంది పడుతున్నామన్నారు. స్థానిక జీవీఎంసీ సిబ్బందికి, సచివాలయ సిబ్బందికి ఎన్ని సార్లు ఫిర్యాదులు ఇచ్చినా ప్రయోజనం లేకపోయిందని, ఇప్పటికైనా చర్యలు చేపట్టాలని కోరారు.

### 10వేల మందితో త్రివర్ణ పతాక ప్రదర్శన రేపు



వివరాలు వెల్లడిస్తున్న బసవ కృష్ణమూర్తి

డాబాగార్డెన్స్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బుధవారం వైఎస్సార్ సెంట్రల్ పార్క్‌లో 10 వేల మంది విద్యార్థులతో..25వేల చదరపు అడుగుల త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించనున్నట్టు స్టూడెంట్స్ యునైటెడ్ నెట్‌వర్క్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజేటి బసవ కృష్ణమూర్తి తెలిపారు. సోమవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉత్తరాంధ్ర విద్యార్థి సేవ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సుంకరి రమణమూర్తి కోరారు. కార్యక్రమంలో గొల్ల ప్రదీప్‌రాజు, కర్రి నరేష్, ఇషాక్ మహ్మద్, పీవీకే కుమార్, శివ దలై, తమ్మన విజయ్, శ్రీకాంత్, రామాయణం సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



# ఆర్టీసీ సర్వీసులు అంతంత మాత్రమే..

- తగరపువలస మీదుగా భీమిలికి వేలల్లో ప్రయాణికులు
- మొక్కుబడిగా ఆర్టీసీ ట్రిప్పులు
- ఆటోలను ఆశ్రయిస్తున్న విద్యార్థులు, ఉద్యోగులు
- రెగ్యులర్ బస్సులు నడపాలని విన్నపాలు



తగరపువలస నుంచి బస్సులు బయలుదేరు స్టేజ్



అంబేడ్కర్ కూడలిలో ఆటోలను ఆశ్రయిస్తున్న విద్యార్థులు

తగరపువలస: భీమిలి నియోజకవర్గంలో ప్రధాన కేంద్రమైన తగరపువలస మీదుగా వివిధ ప్రాంతాల నుంచి భీమిలి–విశాఖ బీచ్‌రోడ్డులో బస్సులు నడపాలని ఈ ప్రాంత విద్యార్థులు, ఉద్యోగులు కోరుతున్నారు. ప్రస్తుతం భీమిలి నుంచి బీచ్‌రోడ్డు మీదుగా అలాగే దొరతోట, క్రాస్‌రోడ్డు మీదుగా, తగరపువలస నుంచి ఆనందపురం మీదుగా విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్‌కు సరిపడా సిటీ బస్సులు నడుస్తున్నాయి. పాతికేళ్ల క్రితం విశాఖ, విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్‌ల నుంచి తగరపువలస మీదుగా భీమిలి వరకు కూడా సిటీ బస్సులు నడిచేవి. ఇవే కాకుండా తగరపువలస–భీమిలి ఆరు కిలోమీటర్ల నడుమ మఫిసిల్ సర్వీసులు కూడా నడిచేవి. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి తగరపువలస మీదుగా భీమిలి వరకు నైట్‌హాల్ట్ సర్వీస్ కూడా అందుబాటులో ఉండేది. దీంతో వివిధ ప్రాంతాల నుంచి భీమిలి వచ్చి డైట్, పాలిటెక్నిక్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు ప్రముఖ ఎయిడెడ్, ప్రైవేట్ విద్యాసంస్థలలో విద్యార్థులు చదువుకునేవారు.

ఇటీవల భీమిలి–విశాఖ బీచ్‌రోడ్డులో ప్రముఖ డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర విద్యాసంస్థలతో పాటు హోటళ్లు పుట్టుకువచ్చాయి. వీటిపై ఆధారపడి చదువుకునే విద్యార్థులు, ఉద్యోగుల సంఖ్య వేలల్లో పెరిగింది. కానీ తగరపువలస–భీమిలి పట్టణాల మధ్య రవాణా ప్రధాన సమస్యగా మారింది. ప్రస్తుతం ఈ రెండు పట్టణాల మధ్య మొక్కుబడిగా ఉదయం రెండు ట్రిప్పులు, సాయంత్రం వేళల్లో ఒక ట్రిప్పు బస్సు పాస్‌లు ఉన్న విద్యార్థుల కోసం నడుపుతున్నా వీటిని రెగ్యులర్‌గా నడపాలన్న డిమాండ్ ఎక్కువగా ఉంది.

**ప్రతీ పనికి భీమిలి వెళ్లాల్సిందే..**

నియోజకవర్గం కేంద్రంగా భీమిలి ఉన్నందున స్థానిక ఎమ్మెల్యే, మంత్రుల క్యాంప్ కార్యాలయాలతో పాటు ప్రభుత్వ డివిజన్ కార్యాలయాలు, ఆర్డీవో, వసతి గృహాలు, హోటళ్లు ఇక్కడే ఉన్నాయి. వీరందరికీ సొంత వాహనాలు లేకపోతే తగరపువలస–భీమిలి ప్రాంతాల మధ్య తిరగడానికి ఆటోలే గతి. ఆ ఆటోలు కూడా మధ్యాహ్నం భోజన వేళ, సాయంత్రం 8 దాటితే అందుబాటులో ఉండకపోవడంతో ఈ అయిదు కిలోమీటర్లు కాళ్లకు పని చెప్పవలసిందే. ఈ ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని తగరపువలస మీదుగా భీమిలికి రెగ్యులర్ బస్సులు నడపాలని, నైట్‌హాల్ట్ బస్సును పునరుద్ధరించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



తగరపువలస మీదుగా భీమిలికి రెగ్యులర్ బస్సులు నడపవలసిన మార్గం

### గంటల తరబడి నిరీక్షణే..



నేను భీమిలి కళాశాలలో చదువుకుంటున్నాను. తగరపువలస నుంచి కాలేజీకి రోజూ బస్సులోనే వెళ్తాను. బస్సు ఉదయం రెండు ట్రిప్పులు తిరుగుతుంది. సాయంత్రం వస్తుందో, రాదో తెలియదు. గంటల తరబడి ఎదురు చూస్తూనే ఉంటున్నాం. ఇక రాకపోతే, ఆటోల్లో వెళ్లాల్సిందే. చాలా ఇబ్బంది పడుతున్నాం. తగరపువలస మీదుగా భీమిలికి సిటీ బస్సులు రెగ్యులర్‌గా నడిపితే మాలాంటి విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం.

–జి.తరుణ్ చైతన్యరెడ్డి, విద్యార్థి, తగరపువలస

### భీమిలి వెళ్లడానికి అత్యంత ప్రయాస



భీమిలి వెళ్లాలంటే చాలా అవస్థలు పడాలి. భీమిలిలో జీవీఎంసీ, తహసీల్దార్ తదితర కార్యాలయాలతో పాటు డ్వాక్రా సమావేశాలు జరుగుతుంటాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో మొక్కుబడిగా నడిచే బస్సుల్లోనూ పాస్ ఉన్న విద్యార్థులను మాత్రమే అనుమతిస్తారు. మిగిలిన వారు సొంతంగా ఏర్పాటు చేసుకున్న రవాణాపై వెళ్లవలసి వస్తోంది. సమయం దాటిపోతుందని, ఆటో ఎక్కినా.. ఆటో నిండితేనే ముందుకు వెళ్తుంది. చాలా అవస్థలు పడుతున్నాం. ఆర్టీసీ అధికారులు స్పందించి, ఈ రెండు ప్రాంతాల మధ్య మరికొన్ని సర్వీసులు నడపాలి.

– కె.మణి, గృహిణి, చిట్టివలస

## ఆదమరిస్తే అంతే..

పద్మనాభం: మండలంలోని మద్ది–అలమండ ఆర్‌ఎస్ రోడ్డుకు అనుసంధానంగా తునిపాలెం గ్రామంలోకి ప్రవేశించే రోడ్డుకు సమీపంలో ఉన్న కల్వర్టు వద్ద ప్రమాదం పొంచి ఉంది. డ్రైవర్లు ఏ మాత్రం ఏమరుపాటుతో ఉన్నా వాహనాలు కల్వర్టులోకి పల్టీ కొట్టే అవకాశం ఉంది. ఈ రోడ్డుపై మద్ది, బాందేవుపురం, గంధవరం, కొత్త కొవ్వాడ, పాత కొవ్వాడ, విజయనగరం జిల్లా జామి మండలం భీమసింగి, అలమండ ప్రాంతాలకు ఆటోలు, లారీలు, ద్విచక్ర వాహనాలు తిరుగుతూ ఉంటాయి. కల్వర్టు వద్ద రక్షణ గోడ లేకపోవడంతో లారీ వంటి భారీ వాహనాలు ఎదురుగా వచ్చేటప్పుడు తప్పించే ప్రయత్నంలో ద్విచక్రవాహనాలు, ఆటోలు కల్వర్టు కిందకు పల్టీ కొడితే ప్రాణాలకే ముప్పు కలిగే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి, కల్వర్టు వద్ద రక్షణ గోడ నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



ప్రమాదం పొంచి ఉన్న కల్వర్టు

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

తగరపువలస: చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నుంచి మొదటి దశ ప్రవేశాలు ప్రారంభమయ్యాయని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు తెలిపారు. ఇదివరకే రిజిస్ట్రేషన్ చేయించుకున్నవారు వచ్చి అడ్మిషన్ తీసుకోవాలని కోరారు. మొదటిదశలో 190 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా వివిధ గ్రూపుల్లో 21 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారన్నారు. మిగిలిన విద్యార్థులు చిట్టివలస జెడ్పీ బాలికల హైస్కూల్ ఆవరణలోని కళాశాలలో ఈ నెల 16లోగా ప్రవేశాలు పొందాలని సూచించారు. మొదటి సంవత్సరం కోర్సుల్లో బీఎస్సీ (ఎంపీసీ), బీఏ, బీకాం కంప్యూటర్స్, బీఎస్సీ బోటనీ, బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ జువాలజీలో 40 వంతున సీట్లు ఉన్నాయని తెలియజేశారు.

## ఎన్నికల కోడ్ అనంతరం రైతుబజారు పనులు

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస: ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సెప్టెంబరు 6 అనంతరం మిగిలిన పనులు పూర్తి చేసి, చిట్టివలస రైతుబజారును ప్రారంభిస్తామని జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ అధికారి షేక్ యాసిన్ తెలిపారు. చిట్టివలస రైతు బజారు ప్రారంభించి ఆరుమాసాలు గడిచినా విక్రయాలు ప్రారంభించకపోవడంతో 'ఎందుకీ తాత్సారం..?' శీర్షికతో ఈ నెల 11న సాక్షిలో వార్త ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీనిపై ఆయన స్పందించారు. రైతు బజారులో పేవింగ్ టైల్స్ పనులు ఇంకా జరగవలసి ఉందన్నారు. కాంట్రాక్టర్ బిల్లులు సీఎఫ్ఎంఎస్‌లో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అలాగే స్పిల్ ఓవర్ బడ్జెట్ మంజూరు కావలసి ఉందని చెప్పారు. ఇప్పటికే రైతులను గుర్తించి, వారికి గుర్తింపు కార్డులు కూడా ఇచ్చామని తెలియజేశారు.

## రమణ మృతి తీరని లోటు



పీస రమణకు నివాళులు అర్పిస్తున్న కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు

మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ పీస రమణ ఆకస్మిక మృతి ఆలయ అభివృద్ధికి, గ్రామానికి కూడా తీరని లోటని ఆలయ కమిటీ పెద్దలు, గ్రామ పెద్దలు అన్నారు. రమణ ఇంటికి వెళ్లి, ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పలువురు కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఆర్జేడీ ఆకస్మిక తనిఖీ

**ఉపాధ్యాయుల సర్దుబాటుపై పరిశీలన**

తగరపువలస: భీమిలి మండల వనరుల కేంద్రాన్ని జోన్–1 ఆర్జేడీ కె.విజయభాస్కర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా భీమిలి ఎంఈవోలు శివరాణి, జయప్రద మాట్లాడుతూ ఉపాధ్యాయ ప్రతినిధి నాయకుల సాయంతో ఖాళీల వివరాలను ఏ విధంగా తయారు చేసింది వివరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్నీ సిద్ధం చేశామన్నారు. దీనిపై సంతృప్తి చేసిన ఆర్జేడీ, ఏమైనా సందేహాలుంటే తనను సంప్రదించాలని సూచించారు. మొట్టమొదటి సారి రాష్ట్ర స్థాయి నుంచి ఆన్‌లైన్‌లో జరుగుతున్న విధానం కాబట్టి ఎంఈవోలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డైట్ సీనియర్ అధ్యాపకుడు మాణిక్యం నాయుడు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



భీమిలి ఎమ్మార్సీలో మాట్లాడుతున్న ఆర్జేడీ విజయభాస్కర్

## మందు బాబులకు రూ.లక్ష జరిమానా

తగరపువలస: ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 10 మందికి భీమిలి 15వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ డి.సౌజన్య సోమవారం రూ.10వేల వంతున జరిమానా విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టం తీసుకునే చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు.

## మహిళ అదృశ్యంపై కేసు నమోదు



పార్వతి (ఫైల్)

భీమునిపట్నం: భీమిలో మహిళ అదృశ్యంపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వివరాలివి.. నేరెళ్లవలస కాలనీలో ఉంటున్న నక్కాన పార్వతి (45) కుమారుడు నక్కాన శివాజీ, కోడలు నక్కాన ప్రియంకతో కలిసి ఉంటున్నారు. కుమారుడు శివాజీ విద్యుత్ లైన్‌మన్‌గా పని చేస్తున్నాడు. కాగా తల్లి పార్వతి, కుమారుడు శివాజీకి తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం ఈమె ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె కొడుకు, కోడలు ఎన్నిచోట్ల వెదికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సస్పెండైన ఆర్టీసీ డ్రైవర్ మృతి

పీఎం పాలెం: సస్పెన్షన్‌లో ఉన్న ఆర్టీసీ డ్రైవర్ అనారోగ్యంతో చికిత్స పొందుతూ మరణించారు. పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలివి.. బోయిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో కుటుంబంతో నివసిస్తున్న ఉమ్మిడి పైడిరాజు (57) ఆర్టీసీ డ్రైవర్‌గా పని చేసేవారు. మద్యానికి బానిసై విధులు సక్రమంగా నిర్వర్తించకపోవడంతో సంస్థ ఉద్యోగం నుంచి తొలగించింది. టీబీ, ఆస్మా, సుగర్‌తో బాధపడుతున్న పైడిరాజుకు ఇన్‌ఫెక్షన్ సోకడంతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కుడికాలుకు శస్త్రచికిత్స చేసి తొలగించారు. కిడ్నీ కూడా ఫెయిల్ అయింది. ఈ నెల 10న ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన పైడిరాజు 11న సాయంత్రం డయాలసిస్ కోసం కేజీహెచ్‌కు వెళ్లగా అక్కడ మరణించారు. మృతుని కుమారుడు రవికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

## అసంబద్ధ సర్దుబాటుపై ఉపాధ్యాయుల నిరసన



ఆనందపురం ఎంఈవో గంగరాజుకు వినతిపత్రం అందిస్తున్న ఫ్యాప్టో ప్రతినిధులు

తగరపువలస: అసంబద్ధ విధానాలతో జరుగుతున్న ఉపాధ్యాయుల సర్దుబాటును వ్యతిరేకిస్తూ రాష్ట్ర ఫ్యాప్టో పిలుపుతో ఆనందపురం మండల విద్యా వనరుల కేంద్రం వద్ద ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎంఈవో–2 కె.గంగరాజుకు వినతిపత్రం అందించారు. ఉపాధ్యాయుల సర్దుబాటు అనేది అసంబద్ధమైనదని, దీనిని బహిష్కరిస్తున్నామని ఉపాధ్యాయులు తెలిపారు. 117 జీవోను రద్దు చేసి 53 ప్రకారం సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఉపాధ్యాయులు టీఆర్ అంబేడ్కర్, ఉప్పాడ రాము, గురుగుబిల్లి గంగాధర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజానికి కృషి



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

**చంద్రంపాలెం హైస్కూల్ విద్యార్థుల ప్రతిజ్ఞ**

మధురవాడ: చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు సోమవారం నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా డ్రగ్‌ఫ్రీ ఇండియా ప్రతిజ్ఞ చేశారు. డ్రగ్స్ వలన కలిగే దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు మధురవాడకు చెందిన గ్రీన్ వ్యాలీ ఫౌండేషన్ ప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమాజం, కుటుంబం, స్నేహితులు మాత్రమే కాకుండా తాము కూడా డ్రగ్స్ రహితంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. దీని కోసం శక్తి మేరకు చేయగలిగిందంతా చేస్తామని ప్రతిన బూనారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఎస్‌వీఎస్ సోమయాజులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రీన్ వ్యాలీ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు ఉమారాజ్, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చంద్రంపాలెం హైస్కూల్లో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపాధ్యాయులు

## విపత్తులపై అప్రమత్తత అవసరం

తగరపువలస: విపత్తుల పట్ల పరిశ్రమల యాజమాన్యాలు అనునిత్యం అప్రమత్తంగా ఉండాలని కర్మాగారాల శాఖ డైరెక్టర్ జి.చంద్రశేఖరవర్మ అన్నారు. భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబరేటరీలో భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యుత్తమ ప్రమాణాలతో భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేసిన యాజమాన్యాన్ని అభినందించారు. సంస్థలో నాలుగు నెలల పాటు జరిగిన విద్యుత్, పర్యావరణ, అగ్నిమాపక, భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఉద్యోగులకు అవగాహన కల్పిస్తూ నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు అందించారు. సంస్థ వైస్ ప్రెసిడెంట్ ఎల్‌వీ రమణ మాట్లాడుతూ సంస్థ యాజమాన్యం భద్రతా ప్రమాణాలు నెలకొల్పేందుకు ఏటా పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తోందన్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వి.సురేష్, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ కె.సుధాకర్, జనరల్ మేనేజర్లు కె.సుబ్బారావు, వైఎస్ కోటేశ్వరరావు, భద్రతా విభాగం అధికారులు చంద్రశేఖర్, ఐ.ఎల్.ప్రసాద్, ఉదయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగులకు బహుమతులు అందిస్తున్న కర్మాగారాల శాఖ డైరెక్టర్ చంద్రశేఖరవర్మ

## నేషనల్ బాక్సింగ్ పోటీల్లో ఆదిలక్ష్మికి రజత పతకం

**నేపాల్‌లో జరిగే అంతర్జాతీయ పోటీలకు ఎంపిక**

తగరపువలస: భారత్ బాక్సింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హర్యానాలోని రోహ్‌తక్‌లో ఈ నెల 2 నుంచి 4 వరకు నిర్వహించిన నేషనల్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో భీమిలి మండలం చిప్పాడ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థిని కొనస ఆదిలక్ష్మికి రజత పతకం లభించింది. 42–44 కిలోల సబ్ జూనియర్ విభాగంలో ఈ ఘనత సాధించి, వచ్చే నెల నేపాల్‌లో జరిగే అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించింది. ఈ సందర్భంగా ఆదిలక్ష్మిని, కోచ్ వాసుపల్లి ఆదినారాయణను ప్రధానోపాధ్యాయిని ఎం.వి.టి.రత్నం, ఉపాధ్యాయులు రేఖ అప్పారావు, ఎస్.విజయకుమార్, జి.సుశీల్‌కుమార్, రాజేశ్వరి, సత్యవతి, అనూరాధ, త్రివేణి, మధురవాణి అభినందించారు.

**దాతలు సహకరించాలి**

ఆదిలక్ష్మి తండ్రి చిట్టిబాబు మరణించడంతో తల్లి రామసంతోషి చిన్న టీ దుకాణం నడుపుతూ అతి కష్టం మీద ఆదిలక్ష్మితో పాటు మరో కుమార్తె జ్యోత్స్నను చదివిస్తోంది. కోచ్ ఆదినారాయణ 17 మందికి శిక్షణ ఇచ్చి బాక్సింగ్ పోటీలకు తీసుకువెళ్లగా ఆదిలక్ష్మి మేటిగా నిలిచింది. వచ్చే నెలలో నేపాల్‌లో జరిగే ఇంటర్నేషనల్ పోటీల్లో పాల్గొనేందుకు ఆదిలక్ష్మి రూ.25వేలు ప్రవేశ రుసుం చెల్లించవలసి ఉంది. ఇందుకోసం దాతలు ఆమెకు సహకరించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.



ఆదిలక్ష్మిని అభినందిస్తున్న జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు

## రైతులను గౌరవించడం మన కర్తవ్యం



విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపక కార్యదర్శి రత్నం

- గ్రీన్ క్లైమేట్ ప్రతినిధులు
- విద్యార్థులకు సాగుపై అవగాహన

తగరపువలస: రైతులు వ్యవసాయం చేస్తున్నారు కనుకనే మనం మూడు పూటలా భోజనం చేయగలుగుతున్నామని గ్రీన్ క్లైమేట్ టీమ్ ఎన్జీవో వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం అన్నారు. మనకు ఆహారం అందించే రైతులను గౌరవించడం మన కర్తవ్యమన్నారు. ఆనందపురం మండలం చందక పంచాయతీలో శంకర్, మోహన్‌లకు చెందిన వ్యవసాయ క్షేత్రంలో నగరానికి చెందిన ఇంటెల్లి విద్యాసంస్థల విద్యార్థులకు సాగుపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రత్నం మాట్లాడుతూ తమ టీమ్ చాలాకాలంగా వివిధ విద్యాసంస్థల విద్యార్థులకు ప్రకృతి ఆధారిత వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్నట్టు తెలిపారు. పదివేల ఏళ్ల క్రితమే వ్యవసాయం ప్రారంభం అయిందన్నారు. ఈ భూమిమీద మొట్టమొదటిగా మొదలైన వృత్తి వ్యవసాయమేనని తెలిపారు. రైతును, ఆహారాన్ని గౌరవించినట్టే భూమిని, గాలిని, నీటిని కూడా గౌరవించాలని సూచించారు. విద్యార్థులు వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలన్నారు. దీనివలన సహనం, నిబద్ధత, కలిసి మెలసి జీవించడం, సమయపాలన, కలుపుగోరుతనం, పరిపాలన దక్షత, సమస్త జీవులను కాపాడుకునే తత్వం, మొక్కలు పెంచడం వంటి అంశాలు అవగతమవుతాయన్నారు. కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ టీమ్ వలంటీర్లు జనపరెడ్డి రవితేజ, ఇళ్ల కృష్ణకుమారి, చిత్రకారుడు సంతోష్, ఉపాధ్యాయులు జయశ్రీ, శ్రీలత, మాధురి, సత్యవతి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు నిర్వహిస్తే చర్యలు

తగరపువలస: ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించవద్దని మధురవాడ జోన్ ట్రాఫిక్ సీఐ కాంతారావు హెచ్చరించారు. సోమవారం ఆయన ఆనందపురం మండలం వేములవలస కూడలిలో ఫుట్‌పాత్‌లను పరిశీలించారు. ఫుట్‌పాత్‌లపై వ్యాపారాల వలన ప్రమాదాలు జరుగుతున్నాయంటూ వస్తున్న విమర్శలను వారి దృష్టికి తీసుకువచ్చారు. ఇకపై నిబంధనలు అతిక్రమించి ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు నిర్వహించవద్దని హెచ్చరించారు. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు.



ఫుట్‌పాత్ వ్యాపారులతో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ కాంతారావు